# అక్షరము

"అక్షరము" వేదమన్త్రములయందు తఱచు కానవచ్చు శబ్దము. వేదమర్థము కావలెననినచో అక్షర శబ్దమున కర్థము తెలియవలెను. అక్షరమును గూర్చి తెలియవలెను.

సంస్కృతభాషయందును, తక్కిన దేశభాషలయందును, అక్షరమనగా నాశనముకానది, అని ఒక అర్థము. రెండవది భాషయొక్క వర్ణములలో (Alphabet) ఒక వర్ణము, అని. కాని వేదభాష వేరు కదా! వేదమా శబ్దమును ఏ అర్థమునందు వాడినదో తెలిసికొని, ఆ అర్థముతోడ వేదమన్త్రమును అవగాహనము చేసికొనవలెనుగదా! లేనిచో వేదము ఉద్దేశించిన అర్థము వేరు, మనమనుకొనునది వేరు.

వేదమునందున్న "అక్షర" శబ్దమునకు అర్థము తెలియవలె ననినచో, వేదమునందు (వేదభాషయందు) ఉన్న స్వర[1], వర్ణసముదాయమునుగుంంచి తెలియవలెను. వీనిని గురించి తెలుపు గ్రంథములకు ప్రాతిశాఖ్యములని పేరు. ప్రతి వేదమునకు, వేరువేరు ప్రాతిశాఖ్యగ్రంథములున్నవి.ఈ ప్రాతిశాఖ్యములు, వేదమునందున్న దేవతాశక్తులను గూర్చి గాని, వేదాన్తమునుగూర్చి గాని మాటాడవు. వర్ణము, శబ్దము, వాటి ఉత్పత్తి, ఉచ్చారణలను గూర్చి చర్చించును. అనగా భాషాశాస్త్రము గురించిఋుగ్వేద ప్రాతిశాఖ్యమును వ్రాసినది శౌనకముని. ఆయన అనేకశాస్త్రములయందు నిధి. అందులో భాషాశాస్త్ర మొకటి. ఆయన వేదమునందున్న స్వర, వర్ణములను గూర్చి వివరించెను.

1. స్వరములు : (అచ్చులు)

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఏ, ఐ, ఓ, ఔ

అచ్చులు కంఠనాళములయందు (Larynx) పుట్టును. నాలిక, దంతములు, పెదిమలు – వీటియొక్క స్పర్శ వలన కలిగెడి, అడ్డులేకుండ నోటినుండి వెలికి వచ్చు "ధ్వని". ఈ స్వనమునకు స్వరమని పేరు.

2. వర్ణములు : (హల్లులు)

హల్లులు పుట్టెడు విధానమును బట్టి మూడు రకములు.

1. స్పర్శలు, 2. అన్తఃస్థములు, 3. ఊష్మములు

1. స్పర్శలు : స్పర్శయనగా తాకుట. నాలికగాని, దంతముగాని, ెపదిమగాని, తాకినప్పుడు పుట్టిన వర్ణమునకు స్పర్శయని పేరు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| క | ఖ | గ | ఘ | ఙ | క–వర్గము |
| చ | ఛ | జ | ఝ | ఞ | చ–వర్గము |
| ట | ఠ | డ | ఢ | ణ | ట–వర్గము |
| త | థ | ద | ధ | న | త–వర్గము |
| ప | ఫ | బ | భ | మ | ప–వర్గము |

నాలికగాని, దంతముగాని, పెదిమగాని, నోటియందు ఎక్కడ తగిలిన (స్పర్శ వలన) ఏ వర్ణము పుట్టునో ఎవరికి వారు, తెలుసుకొనవచ్చును. పై పట్టికలో ఙ, ఞ, ణ, న, మ – అను వర్ణములు, తక్కిన స్పర్శలనుండి వేరుగా చూపబడినవి. క మొదలు భ వరకు పుట్టిన వర్ణములు మననోటి బిలము నందు ప్రతిధ్వనించి (resonance) వెలికి వచ్చును. ఙ, ఞ, ణ, న, మ – వర్ణములు నాసికాబిలమునందు గూడ ప్రతిధ్వనించి వెలికి వచ్చును. కనుక, వీటికి అను నాసికములు అని పేరు. ఈ విధముగా స్పర్శలు రెండు రకములు. అనునాసికములు కానివి, అనునాసికములు.

2. అన్తఃస్థములు : య, ర, ల, వ

ఈ వర్ణములను ఉచ్చరించుటకు, స్పర్శలను పలుకుటకు వలసినంత ఒత్తిడి అక్కరలేదు. నాలికగాని, పెదిమ గాని, తగిలీ తగలనట్లు అంటిన చాలును. ఈ వర్ణములను సుఖముగా (easily) ఉచ్చరించు స్థానములు, మధ్యలో నుండి, నోటని కుడి ఎడమ భాగములుగా విభజించును. ఇది ఎవరికి వారు కనుగొన వచ్చును. ఈ వర్ణములను ఉచ్చ రించు ప్రయత్నము స్పర్శలకు వలసినంత బరువు కాదు. తరువాత చెప్పెడి ఉష్మములంత తేలికకాదు. ఈ రెంటికి మధ్యలోనుండుట చేత వీనికి అన్తఃస్థములు (మధ్యలోనున్నవి) అని పేరు.

3. ఊష్మములు : హ, శ, ష, స

వీనిని ఉచ్చరించువేళ వాయువుకూడ, శబ్దముతోడ వెలికి వచ్చును. వీటి ఉచ్చారణకైన ప్రయత్నము, అన్తఃస్థములకంటె తక్కువ.

కనుక మనము ఉచ్చరించుటకు సేయు ప్రయత్నము ప్రధానముగా ఐదు విధములు.

**ఒకటి:** స్పర్శయే లేకుండ, కంఠమునుండి ధ్వనిని వెలికి తెచ్చుట (అచ్చులు).
**రెండు:** స్పర్శతోడ, నాసికాభాగమును ఉపయోగింపకుండ పలుకుట – క చ ట త ప వర్గముల మొదటి నాలుగు వర్ణములు.
**మూడు:** స్పర్శయందు నాసికాభాగమును కూడ కలుపుట, అనునాసికములు.
**నాలుగు:** స్పర్శతోడి యత్నమునకును, వాయువుతోడ నుచ్చరించుటకును మధ్యనున్న ప్రయత్నము–అన్తఃస్థములు.
**ఐదు:** వాయువునకు అభ్యంతరము పెట్టకుండ నుచ్చరించుట – ఊష్మములు.

ఈ ఐదు విధములుగా ఉచ్చరించు శక్తి మానవునకున్న ప్రధానశక్తులలో నొకటి. ఈ శక్తిచేత, తనలోనున్న జ్ఞానమును వెలికి తెచ్చుచున్నాడు. ఈ జ్ఞానవ్యక్తీకరణమునకు, తెలియ జెప్పుటకు ఒక పేరు పెట్టవలెను. ఆ శక్తి యొక్క సంపూర్ణత్వము, పూర్తి అయిన అర్థమును తెలియజేయు శబ్దమును, మాటను కూర్చవలెను. వేదభాష ప్రప్రథమ భాష. సర్వజ్ఞానమును, సర్వశక్తులను తెలియజేయు భాష. అందుచేత జ్ఞానవ్యక్తీకరణ శక్తికి వేదము శబ్దమును కూర్చి తీరవలెను. కనుక కూర్చినది. దాని పేరు అక్షరము. అక్షరము కాదు. క్ష వర్ణము సంస్కృతము, తెలుగు భాషలలో నున్నది కాని, వేదభాషలలో లేదు. వేదము మానవుడు తన వాగ్యంత్రమునందు ఏ యే స్పర్శస్థానములతోడ పుట్టు

చున్నాడో తెలియచెప్పు శాస్త్ర గ్రంథము. వేదభాషలో స్వరమున్నదనగా, వర్ణమున్నదనగా వాటి ఉచ్చారణ శక్తితో మానవుడుద్భవించుచున్నాడని అర్థము. మన వాగ్యంత్రము నందు క్ష కారమునకు వేరుగా స్పర్శస్థానము లేదు. అందు వలన వేదభాషలో క్ష-కు వర్ణ మర్యాద లేదు. క, ష లను వెంట వెంటనే స్పర్శించినచో పుట్టు ధ్వని క్షకారము.ఈ రెండు స్పర్శల మధ్యనున్న కాలము ఎంత స్వల్పమనగా, ఒక్కటే వర్ణమా యను భ్రాంతి కలిగించునంత స్వల్పము. క, ష ల ఉచ్చారణముల మధ్యనున్న కాలము ఎందుకు స్వల్పము? క పలుకుటకు నాలిక యొక్క యెడమ భాగమున మాత్రమే నోటి పైభాగమును స్పర్శింతుము. ష నుపలుకుటకు నాలిక రెండు వైపులను పైకెత్తి తూము వలె చేసి గాలిని వదలుదుము. క పలుకు వేళకు నాలిక ఒక భాగము పైకి లేపితిమి కదా! ఇంక రెండవ భాగమును మాత్రమే పైకి మడవ వలెను. క పలుకునప్పటికేవాయువు కంఠనాళముల వద్ద నున్నది. క పలుకగనే మిగిలిన వాయువును అడ్డుపెట్టకుండ తూముగా చేసిన నాలిక మధ్య నుండి బయటకు వదలుటయే. తాత్పర్యమేమనగా, క ఉచ్చరించునప్పటికే ష కు వలసిన సగము ప్రయత్నము పూర్తి అయినది. అందువలన ష ను తక్కువ కాలములో ఉచ్చరింప గలుగుచున్నాము. సన్నిహితస్పర్శలతో రెండు వర్ణములను సృష్టించు శక్తి మానవుని అక్షరశక్తిలో భాగమని చెప్పుటకే అక్షర శబ్దము నందలి సంయుక్తవర్ణ ప్రయోజనము. ప్రధానమైన రంగులను కలిపి కొత్త రంగులను సృష్టించినటులే మానవులు సన్నిహిత వర్ణ సంకీర్ణముతోడ కొత్త ధ్వనులను పుట్టించి వారి వారి భాషలలో వేరైన అక్షరములను కల్పించుచున్నారు. చైనా దేశపు భాషలలో జపాను భాషలో అనేకమైన దేశభాషలలో సంకీర్ణవర్ణములను ప్రత్యేక వర్ణములుగా భావించుట చూచుచున్నాము. ఇవి యన్నియు మానవ నిర్మితమైన భాషలు. వేదభాష దేవభాష అనగా మానవశక్తికి అతీతమైన ఉచ్చారణ శక్తిని అక్షర శక్తిని తెలియజేయు భాష. క ప్రథమ స్పర్శగాన, ష ఊష్మము గాన, ఈ రెండు రకముల వర్ణ ములను గూడ ఉచ్చరించు శక్తికూడ మానవునకు ఉన్నది అని అక్షరములోని క్షకారము తెలియజేయుచున్నది. ఇంక మిగిలినవి రెండు రకములైన వర్ణములు - అన్తఃస్థములు, అనునాసికములు. ఆ రెండు వర్గములలో నుండి చెరియొక వర్ణ మును కలిపినచో కల్పింపబడిన శబ్దము మానవుని ఉచ్చారణ శక్తిని తెలియజేయు మాట అగును. అన్తఃస్థములు - య, ర, ల, వ వర్ణములు గదా! వేదము నాల్గింటిలో ర-కారమును అక్షరమునందు చేర్చి ఆ వర్ణము చాల ముఖ్యమైనదని తెలిపినది. వేదభాషాశాస్త్ర వేత్తలు అనగా ప్రాతిశాఖ్యమును వ్రాసిన ఆచార్యులు వారి గ్రంథముల యందు ఈ ర కారమును గూర్చి విపులముగా చర్చించిరి. అన్ని వర్ణములకు ఒక్కొక్క స్పర్శస్థానముండగా, రకారమునకు రెండు స్పర్శస్థానములు. మన పైపంటివరుసకు వెనుకగా ఎత్తైన ప్రదేశమున్నది గదా! దానికి బర్స్వము అని పేరు. దానిని నాలికచేత తాకినచో రకారము పుట్టును. ఈ రకారమునకు బర్భ్యము అనిపేరు. నాలిక చాపి, ``పైపంటి మొదళ్ళనంటి నప్పుడు కూడ రకారము పుట్టుచున్నది. దీనికి దన్తమూల్యము అని పేరు. త, థ, ద, ధ, న వర్ణములతోడ రకారమును కలుపవలె నన్నచో, (త్ర, ధృ, నృ, మొదలైనవి) దంతమూల్యమైన రకారమును పలికెదము. తక్కిన వేళల మనముచ్చ రించు రకారము బర్భ్యము. వేదము తన మంత్రముల యందు ఈ రెండు రేఫముల నుపయోగించి ఈ రెండు స్థాన ములలో ఎచ్చటవలసిన అచ్చట మనసు నిలుచునట్లు చేసినది. ఇదంతయు వేదభాష వర్ణములు, వాటికి మనస్సు నిల్పు శక్తిని గూర్చి విచారించు వేళ ఆలోచింప వలసినది. అయినను, రకారముయొక్క ప్రాధాన్యత తెలియుట కొరకు పై వివరణము. మనము చర్చించునది అక్షరమును గూర్చి కదా! అందువలన ముందుకు సాగుదుము.

ఇంక మిగిలినది అనునాసికోచ్చరణ శక్తి. మ్ అను హల్లుతో వాగ్యంత్రము మూతపడునుగాన, అక్షరమ్ – అనునది మానవోచ్చారణను తెలుపు శబ్దమయినది. ఇది వేద భాషా శబ్ద నిర్మాణ విధానము.

అక్షరమనగా వట్టి ఉచ్చారణ శక్తి మాత్రమేనా? ఉచ్చారణ యనగా నేమి? లోనున్న జ్ఞానమునందు, మనము వ్యక్తపరచదలచిన భాగమును శబ్దరూపముగ వెలికి తెచ్చుట. మహాచైతన్యమయిన బ్రహ్మము ఏ విధముగా పంచ భూతములు, నదులు, పర్వతములు, ప్రాణులుగా మారుచున్నదో, అటులనే అర్థకలిత బ్రహ్మము శబ్దరూపమగు చున్నది. జ్ఞానము, స్వర, వర్ణముల నాశ్రయించి అర్థసహిత శబ్దజాలమగు శక్తి అక్షరము. అదియే బ్రహ్మము.

అందువలననే, వేదమెచ్చటను ఓమ్ అనిన స్వరమునుగాని, ఓమ్ అనిన వర్ణమునుగాని బ్రహ్మ మనలేదు. ఓమ్ నందున్న అర్థమును భావించి, ఓమ్ అనిన శబ్దమునుచ్చరించు శక్తిని బ్రహ్మ మనినది. ఓమిత్యేకాక్షరం[2] బ్రహ్మ. ఓమిత్యేక "వర్ణం" బ్రహ్మ కాదు. వర్ణము, ఆ వెనుకనున్న ఉచ్చారణ శక్తికి శరీరము వంటిది. ఆ శక్తి, ఆ జ్ఞానము, వర్ణము అనిన శరీరమునకు ఆత్మ. అది సాక్షాద్బ్రహ్మము. శబ్దబ్రహ్మము. దానిని ఉపాసించుట యనగా వేదమన్త్రముల నర్థము చేసికొనుట. ఆ వేదమన్త్రములు, ఎంత అర్థమైన, మనను గురించి మన సృష్టిని గురించి మనకంత తెలియును.

ఋచో అక్షరే పరమే వ్యోమన్యస్మిన్దేవా అధి విశ్వేవనిషేదుః – ఇది ఋగ్వేద ప్రథమ మండలమునందలి 39వ ఋక్కునందలి అర్థర్చ (ఋక్కులో సగభాగము). ఈ మహామన్త్రమునకు అనేకార్థములున్నవి. సాయణాచార్యులు ఆయన భాష్యమునందు నాలుగు అర్థములను వ్రాసినాడు. తక్కిన భాష్యకారులు వేరైన అర్థములను[3] వ్రాసినారు. కాని అన్నియును బ్రహ్మపరముగనే ఉండును. వేదము ఆ బ్రహ్మమైన విషయము చెప్పదుగాన.

ఋచము–ఋగ్వేదముతో నారంభమయిన నాలుగు వేదములు. వానియందున్న అక్షరము పరమమైన, ఉత్తమమైన వ్యోమము నందు (ఆకాశమునందు) నిండి ఉన్నది. ఆ అక్షరము సర్వవ్యాపి. విశ్వమునందున్న సకల దేవతాభావములు, సర్వదేవతాశక్తులు, ఆ అక్షరశక్తి మీద ఆధారపడి యున్నవి. అక్షరమయమయిన వేదము సృష్టిప్రతి రూపమనితాత్పర్యము.

య ఏవం వేద! దానిని తెలుసుకొనెదము గాక!

1. వర్ణం, స్వరం మాత్రాబలం సామసంతానః తైత్తిరీయోపనిషత్తు (2.1)
వర్ణములు, స్వరములు, మాత్ర, బలము, సామ, సంతానము – ఇవి
వేదభాష, వేదమన్త్రలక్షణములని భావము. వేదమన్త్రములు అర్థము
కావలెననినచో, పైమాటలన్నిటి అర్థము తెలియవలెను.

2. వేదమునందున్న అక్షర శబ్దమునకు అర్థము – స్వరము, వర్ణము కాదనియు,
అందలి క్షకారము, కకార, షకారములు కలసిన సంయుక్తవర్ణమనియు
తెలిసినచో, క్ష, క్ష, – వర్ణములలో ఏది వాడినను ఇబ్బంది లేదు.

3. వేదమన్త్రములందలి అక్షరము, సుదీప్తమైన, పవిత్రమైన అగ్ని (పావకము) వంటిది.
ఆ పావకమునుండి సరూపములైన విస్ఫులింగములు పుట్టినట్లు, వేదమన్త్రాక్షరము
నుండి వివిధములైన భావములు (అర్థములు) పుట్టును (ప్రజాయంతే) –
అథర్వణవేదోపనిషత్తయిన ముండకోపనిషద్వాక్యము.

యథా సుదీప్తాత్పావకాద్విస్ఫులింగాః సహస్రశః
ప్రభవన్తే సరూపాః తథా క్షరాద్వి విధాః సౌమ్య!
భావాః ప్రజాయన్తే (ద్వితీయ ముండక ప్రథమ ఖండము)

బహ్వర్థములు పుట్టునట్లు వ్రాయుచున్నానని వేదమే చెప్పుచున్నది.
వేదమన్త్రముల యందలి స్వరములు, వర్ణములు, వాని యందున్న
అక్షరము ఎంత శక్తి వంతమో ఎవరికి వారూహించుకొనవచ్చును.